ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 22 సెప్టెంబరు 2024



కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి 8

మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకం 8



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక

- వానాకాలం జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో సాగు
- దిగుబడి అంచనా 4.37 లక్షల మెట్రిక్ టన్నులు
- పౌరసరఫరాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం
- ఈ సారి ప్రత్యేకంగా సన్నరకం కొనుగోళ్లు
- అక్టోబరు రెండో వారం నుంచి ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ సారి ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనుంది. వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు పడ్డారు. వరి నాట్లు ఆలస్యమయ్యాయి. జూలైలో వర్షాలు కురవడంతో వరినాట్లు జోరందుకున్నాయి. ఆగస్టు, సెప్టెంబరులో కుండపోతతో రైతులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలతో దిగుబడిపై ప్రభావం పడింది. జిల్లాలో పౌరసరఫరాల కార్పొరేషన్ అక్టోబరు రెండో వారం నుంచి ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేసింది. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా వరి 1.80 లక్షల ఎకరాల్లో వేశారు. 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాల ద్వారా కొనుగోలుకు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాలో వానాకాలం దిగుబడి అంచనా..

జిల్లాలో వానాకాలానికి సంబంధించి పౌరసరఫరాల శాఖ 1.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో స్థానికంగా 60 వేల మెట్రిక్ టన్నులు వినియోగించుకోగా, మిగతా 3.77 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం మార్కెట్‌లోకి రానుంది. ఇందులో మిల్లర్లు 77,885 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు. మిగతా 3 లక్షలమెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేయనున్నారు. ధాన్యం దిగుబడి కొనుగోలు కేంద్రాలకు అక్టోబరు రెండో వారంలో కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు అంచనావేశారు. అక్టోబరులో పౌరసరఫరాల శాఖ ద్వారా 25వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరుగుతుందని అంచనా వేశారు. నవంబరులో 75 వేలు, డిసెంబరులో 1.50లక్షల మెట్రిక్ టన్నులు, 2025 జనవరిలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని దీని ప్రకారం కొనుగోలు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు



- రజిత, డీఎం, సివిల్ సప్లయిస్

వానాకాలం ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేశాం. జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేపడతాం. కొనుగోళ్లకు అవసరమయ్యే తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు సిద్ధం చేశాం. పౌరసరఫరాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

34, 230 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం

ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ 500 బోనస్ ప్రకటించిన క్రమంలో రైతులు సన్నరకం వైపు ఆసక్తి చూపారు. జిల్లాలో 16,300 ఎకరాల్లో సన్నరకం సాగు చేశారు. దీని ద్వారా 34,230 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో స్థానికంగా 4230 మెట్రిక్ టన్నుల ధాన్యం వినియోగించుకోగా మార్కెట్‌లోకి 30 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా. ఇందులో మిల్లర్లు 5400 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే మిగతా 24,600 మెట్రిక్ టన్నులు పౌరసరఫరాల కార్పొరేషన్ కొనుగోలు చేయనున్నట్లు అంచనా వేశారు.

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా 258 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ ద్వారా 44 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 202, డీసీఎంఎస్ ద్వారా 8, మెప్మా ద్వారా 4 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఉపయోగించడానికి 75 లక్షల గోనె సంచులు అవసరం కానున్నాయి. ప్రస్తుతం 25.05 లక్షల సంచులు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో కొత్తవి 8 లక్షల 8 వేల సంచులు, ఇప్పటికే ఉపయోగించినవి 2.47 లక్షల చొప్పున అంచనా వేశారు. రైస్‌మిల్లర్ల వద్ద 14.50 లక్షలు అందుబాటులో ఉన్నాయి. 49.95 లక్షల గన్నీ బ్యాగులు సమరూర్చుకోవాల్సి ఉంటుంది.258 కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు 7777, ప్యాడీ క్లీనర్లు 634, మాయిశ్చరైజ్ మీటర్లు 603, వేయింగ్ మిషన్లు 766 సిద్ధం చేశారు. జిల్లాలో 107 రైస్‌మిల్లులు ఉండగా రా రైస్‌మిల్లులు 73, బాయిల్డ్ రైస్‌మిల్లులు 34 ఉన్నాయి.

కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. వానాకలం సీజన్ ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాం కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు, అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా తేమ శాతం 17 ఉండేలా చూసుకొని కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2320, కామన్ రకానికి రూ.2300 నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని 13 మండలాల్లో వ్యవసాయ అంచ నాల ప్రకారం 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు తెలిపారు. ఇందుకోసం 258 కొనుగోలు కేంద్రాలను ప్రారం భించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. సింగిల్ విండోల ద్వారా 202, ఐరూసీ ద్వారా 44, ఇతర శాఖల ద్వారా 12 కేంద్రాలను ప్రారం భించనున్నట్లు తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించి టార్పాలిన్లు 7777, తూకం వేసే యంత్రాలు 766, ప్యాడీ క్లీనర్లు 634, తేమ శాతం చూసే మిషన్లు 603 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు ఇబ్బం దులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచిం చారు. ఈ సమావేశంలో డీసీఎస్‌వో వసంతలక్ష్మీ, జిల్లా మేనేజర్ రజిత, డీఏవో అఫ్జల్ బేగం, డీసీవో రామకృష్ణ, డీఎంవో ప్రకాష్, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, డీటీవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 21: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ సిగ్నల్స్‌నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని స్థానిక కల్యాణ మండపంలో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసెస్ ఫేజ్-2 అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు విద్యార్థి దశనుంచే అలవర్చుకుంటే రోడ్డు ప్రమాదాలు అరికట్ట వచ్చన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్సై రాజు, ఎన్జీవో ఓరుగూ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం సూచించారు. శనివారం సిరిసిల్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాసంలో భాగంగా విద్యానగర్, అంబేద్కర్ నగర్, బోయవాడ, పోచమ్మ వీధి, సిద్ధులవాడ, పత్తిపాక వీధి, కంచర వీధి, రాళ్లబావి, పోస్ట్ ఆఫీస్ వీధి, చాకలి వీధి, శాంతినగర్, తంగళ్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, ఆరోగ్య లక్ష్మీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలని సూచించారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 21: ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. శనివారం సిరిసిల్ల కోర్టు ఆవరణలో కరీంనగర్ ఫార్చున్ మెడికేర్ హాస్పిటల్ దశాబ్ది వేడుకల సందర్భంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరు ఆహార నియమాలు పాటించాలన్నారు. వ్యాయామం, యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డొర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, సీనియర్ న్యాయవాదులు బిట్ల విష్ణు, నాగరాజు గౌడ్, గుడ్ల కిషన్, పుష్పలత పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయంపై విస్తృత ప్రచారం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 21: ఉచిత న్యాయ సహాయంపై విస్తృత ప్రచారం చేయాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిరుపేదలకు ఉచిత న్యాయం అందించనున్నట్లు చెప్పారు. టౌన్ సీఐ కృష్ణ, రూరల్ సీఐ మొగిలి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చీఫ్ పర్శరాములు, డిప్యూటీ చీఫ్ మల్లేష్, అసిస్టెంట్ జ్యోతి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజి భాస్కర్ పాల్గొన్నారు.

సిరిసిల్లలో 'రాంనగర్ బన్నీ' సినిమా బృందం సందడి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 21: సిరిసిల్లలో రాంనగర్ బన్నీ సినిమా నటీనటులు శనివారం రాత్రి సందడి చేశారు. అక్టోబరు 4న విడుదల కానున్న రాంనగర్ బన్నీ సినిమాపై సిరిసిల్ల ప్రజలతో కలిసి ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముచ్చటించారు. సినిమా హీరో చంద్రహాసన్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, దర్శకుడు శ్రీనివాస్ మహత్, నిర్మాత, మలయాజ ప్రభాకర్, ఆర్టిస్ట్ ప్రభాకర్ చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 21: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, రాబోయే పరీక్షలపై దృష్టి సారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించగా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడవద్దని సూచించారు. సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లకు దూరంగా ఉండాలని, పది సంవత్సరాలు కష్టపడి చదివితే జీవితం ఉన్నతంగా ఉంటుందని అన్నారు. బాలికలు, మహిళల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాయలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుగ్గిళ్ల జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల తనిఖీ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21: జిల్లా పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి తనిఖీ చేశారు. ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలలోని రికార్డులు, స్కానింగ్ మిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం నిబంధనలను పాటించాలని, లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల రిసెప్షన్ సెంటర్ వద్ద ధరల సూచిక, లింగ నిర్ధారణ హెచ్చరిక బోర్డులు, రిజిస్ట్రేషన్, పొల్యూషన్ సర్టిఫికెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట హెచ్‌ఈ బాలయ్య ఉన్నారు.

బతుకమ్మ, దసరా పండుగలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వేములవాడ, సెప్టెంబరు 21: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించినట్లు వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. వేములవాడ పురపాలక సంఘం పాలకవర్గం అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించిన అనంతరం సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరంఆమె మాట్లాడుతూ రాష్ట్ర పండుగైన సద్దుల బతుకమ్మ, దసరా సందర్భంగా దాదాపు 28 లక్షల రూపాయల నిధులతో భారీ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా మూలవాగులో, విలీన గ్రామాల్లో, పట్టణంలోని అన్ని వార్డులలో మున్సిపల్ తరపున విద్యుత్ దీపాల ఏర్పాటు, శానిటేషన్ నిర్వహణ, బతుకమ్మ పండుగకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించామన్నారు. మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, ఏఈ నరసింహస్వామి, టీపీవో అన్సారి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీడీపీ పనులపై నివేదిక అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 21: జిల్లాలో సీడీపీ పనుల స్థితిగతులపై నివేదికలు అందించాలని కలెక్టర్‌సందీప్ కుమార్ ఝా అన్నారు. సీడీపీ అభివృద్ధి పనులపై శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధి నిధులు, పనులకు సంబంధించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ద్వారా రూ.51 కోట్ల 85లక్షలకు పైగా విలువ గల 1833 పనులు మంజూరైనట్లు, వాటిని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ మొదలగు 18 ఏజెన్సీలకు కేటాయించినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి పనులలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం రూ.16 కోట్ల 98 లక్షల పైగా ఖర్చు చేసి 738 పనులు పూర్తి చేశామని, రూ.8 కోట్ల 46 లక్షలకు సంబంధించిన 300 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 24 కోట్ల 21 లక్షలకు సంబంధించి 795 పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పూర్తయినా యూసీలు సమర్పించక పోవడంతో ప్రభుత్వ రికార్డుల్లో పనులు పూర్తి కానట్లు ఉందన్నారు.

ఉపాధ్యాయుల అలసత్వంపై కలెక్టర్ ఆగ్రహం

- వీర్నపల్లిలో ప్రభుత్వ పాఠశాలల పరిశీలన



కేజీబీవీ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వీర్నపల్లి, సెప్టెంబర్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో అలసత్వం వహిస్తున్న ఉపాధ్యాయులపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆగ్రహం వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. అంతకుముందు శుక్రవారంరాత్రి కేజీబీవీ పాఠశాల భవనం పైనుంచి దూకిన విద్యార్థిని ఘటనపై వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థిని దూకిన పై అంతస్థుకు చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థిని హాస్టల్ భవనంపై నుంచి దూకే సమయంలో ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని, పాఠశాల ప్రత్యేక అధికారి లింగవ్వపై మండిపడ్డారు. పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు వివిధ మండలాల నుంచి వస్తున్నారని సమాధానం ఇవ్వడంతో వారిని స్థానికంగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల మైదానంలో గడ్డిని తొలగించాలని, భవనం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. పాఠశాలకు వెళ్లే దారిలో వర్షానికి వాగు ప్రవాహంతో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో రఘురాంను ఆదేశించారు. అక్కడి నుంచి ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలో కింది అంతస్తులో తరగతి గదులు ఖాళీ ఉండి, పై అంతస్తులో విద్యార్థులకు బోధించడం ఎందుకని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు.వెంటనే కింది అంతస్తులో బోధించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్జీఎఫ్ క్రీడలను ప్రారంభించారు. డీఈవో రమేష్ కుమార్, జిల్లా వైద్యాధికారి వసంతరావు, కేజీబీవీ జీఈసీవో పద్మజ, ఎమ్మార్వో ఉమారాణి, ఎంపీడీవో రఘురాం, నాయబ్ తహసీల్దార్ మారుతి రెడ్డి, కేజీబీవీ ఎస్‌వో లింగవ్వ, ప్రిన్సిపాల్ అశోక్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఉన్నారు.

●ప్రభుత్వ పాఠశాల సమయానికి బస్సులు రావడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించగా డిపో మేనేజర్‌తో బస్సులను నడపాలని ఆదేశించారు.

గంజాయి నిర్మూలనకు సమన్వయంతో పని చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 21 : జిల్లాలో గంజాయి నిర్మూలన కోసం అన్ని ప్రభుత్వ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి నార్కో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గంజాయి అక్రమరవాణా చేసినా, విక్రయించినా, తాగినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వాటికి అలవాటు పడితే ఆర్థికంగానూ, ఆరోగ్య పరంగానూ అనేక ఇబ్బందులు తప్పవని సూచించారు. డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు మీడియా, సోషల్ మీడియాతోపాటు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ పంచాక్షరి, డీఏవో అఫ్జల్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21: పాముకాటుకు గురైన ఇల్లంతకుంట మండలం గాలిపల్లి సంక్షేమ పాఠశాల విద్యార్థి రమావత్ రోహిత్‌తోపాటు వీర్నపల్లి కేజీబీవీ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని పర్లపల్లి అశ్వితకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి వసంతరావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులను శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులు కోలుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి వైద్యురాలు స్రవంతి ఉన్నారు.

బీసీ హాస్టల్‌ను పరిశీలించిన ఎంఈవో

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను ఎంఈవో బన్నాజీ పరిశీలించారు. హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న రమావత్ రోహిత్‌ను పాముకాటు వేయగా శనివారం పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులు ఆందోళన చెందవద్దన్నారు. హాస్టల్ ప్రహరి పక్కన శుభ్రం చేయాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. నివేదికను ఉన్నతస్థాయి అధికారులకు పంపుతామన్నారు. కారప్రదానోపాధ్యాయిని మేకల పావని, యాద రవి తదితరులు ఉన్నారు.

ఎమ్‌స్వాస్థ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

- రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా గంభీరావుపేటలో ఏర్పాటు

గంభీరావుపేట, సెప్టెంబరు 21: గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ వైద్య సలహాల్లో భాగంగా ఎమ్ స్వాస్థ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య సేవలను అందించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో మొదటగా గంభీరావుపేటలో నాబార్డు, సింగిల్ విండోల సహకారంతో ఏర్పాటు చేసినట్లు నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవరణలో నాబార్డు ద్వారా ఏర్పాటు చేసిన ఈ క్లినిక్ శనివారం ఎమ్ స్వాస్థ్ సౌత్ ఇండియా మార్కెటింగ్ రీజినల్ హెడ్ శరత్ చంద్రతో కలిసి నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావులు ప్రారంభిం చారు. ఒక్కో కుటుంబం నుంచి 365 రూపాయలు చెల్లిస్తే ఏడాది పాటు ఉచితంగా వైద్య సేలు అందిస్తామని అన్నారు. 400 మంది వైద్యులు అన్‌లైన్‌లో సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

మానకొండూర్, సెప్టెంబరు 21: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజర వ్వాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించడమే కాకుండా భాషలో నైపుణ్యం సాధించాలని చెప్పారు. దీర్ఘకాలంగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం మధుసూదనాచారి, జిల్లా సమన్వయకర్త ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

గన్నేరువరం, సెప్టెంబరు 21: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ పాషాను కలెక్టర్ శనివారం సస్పెండ్ చేశారు. పాషా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో సరైన ధ్రువపత్రాలు లేనప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చాడని, మ్యుటేషన్‌లు చేశాడని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గంగాధర, సెప్టెంబరు 21: గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామశివారు పరిధిలో వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉప్పరమల్యాల శివారులో గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బావిలో మృతి చెంది ఉన్నాడని సమాచారం రావడంతో పరిశీలించామని చెప్పారు. మృతుడు నీలిరంగు ప్యాంటు, టీ షర్టు ధరించి ఉన్నాడని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోటి రూపాయలతో ఇద్దరు పరారీ..?

హుజూరాబాద్, సెప్టెంబరు 21: హుజూరాబాద్ ప్రాంతంలో అప్పులు చేసిన ఇద్దరు వ్యక్తులు కోటి రూపాయలు చెల్లించకుండా పరారవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ఓ హోటల్ నిర్వాహకుడు 15రోజుల క్రితం రూ. 50లక్షలతో పరారీ కాగా, రెండు రోజుల క్రితం రంగాపూర్ గ్రామానికి చెందిన డేకరేషన్లు చేసే వ్యక్తి రూ. 50లక్షల రూపాయలు అప్పులు చెల్లించకుండా ఉడాయించాడు. వీరు ఇద్దరు ఏళ్లగా నమ్మకంగా వ్యాపారం చేసుకుంటుండడంతో కొంత మంది తమ వద్ద ఉన్న డబ్బులను వడ్డీ ఆశతో అప్పుగా ఇచ్చారు. వీరిద్దరూ పరారీ కావడంతో వారి ఆచూకీ కోసం బాధితులు గాలిస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ బేకరి దుకాణం యజమానితో పాటు సూపర్‌బజార్ రోడ్‌లో చిట్టీలు నడి పే వ్యక్తి కూడా రూ. 1.50కోట్ల రూపాయలు అప్పులు చెల్లించకుండా పరారయ్యాడు. వరసగా నలుగురు పరారీ కావడం పట్టణంలో చర్చనీ యాంశమైంది.

మహిళ బంగారు నగలు చోరీ

చొప్పదండి, సెప్టెంబరు 21: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన మహిళ ఆరు తులాల బంగారు నగలను దుండగులు చోరీ చేశారు. ఎస్‌ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి రాధ ఆరు తులాల బంగారం చొప్పదండిలోని యూనియన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టడానికి శనివారం వచ్చింది. బ్యాంక్‌లో బంగారం కవర్ పెట్టి జిరాక్స్ కోసం బయటకు వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా బంగారు నగలు ఉంచిన కవర్ కనిపించలేదు. రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బందనకల్ శివారులో పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని బందనకల్ శివారులో పేకాట రాయుళ్ల స్థావరం దాడి చేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ శనివారం తెలిపారు. సమాచారం మేరకు బందనకల్ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నా రు. మరో అరుగురు పరారు అయ్యారని తెలిసింది.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,502 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 8,502 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



బి పల్లవి | మణిచరణ్ | శశాంక్

చొప్పదండి, సెప్టెంబరు 21: ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నవోదయ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బి పల్లవి, శశాంక్, మణిచరణ్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, పీఈటీ రాధికను ప్రిన్సిపాల్ మంగతయారు శనివారం అభినందించారు. ఎంపికైన విద్యార్థులు నవోదయ విద్యాలయ జట్టు తరుపున జాతీయ స్థాయి హ్యాండ్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మంగతయారు తెలిపారు.

భవితకు నవోదయం

- పీఎంశ్రీ స్కూల్స్‌గా జవహర్ నవోదయ విద్యాలయాలు - పేరు మార్చిన కేంద్ర విద్యాశాఖ - విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం

చొప్పదండి, సెప్టెంబరు 21: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత భోజన వసతితో అత్యుత్తమ విద్యను అందిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జవహర్ నవోదయ విద్యాలయాలు పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) స్కూల్స్‌గా మారాయి. కేంద్ర విద్యాశాఖ ఈ మేరకు మార్పు చేసింది. తమిళనాడు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని 661 నవోదయ విద్యాలయాలు పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాలుగా మార్పు చేశారు. ప్రస్తుతం ప్రతీవిద్యార్థికి ఇస్తున్న లక్ష రూపాయల బడ్జెట్‌కు అదనంగా మరో 20 వేల రూపాయలను పెంచనున్నట్లు సమాచారం. నవోదయ విద్యాలయాలు ఏర్పడిన 38 ఏళ్ల తరువాత పేరు మారడం విశేషం. కాగా నవోదయ విద్యాలయంలో ప్రస్తుతం ప్రతీ విద్యార్థిపై కేంద్ర ప్రభుత్వం ఏడాదికి లక్ష రూపాయలను ఖర్చు పెడుతోంది. పీఎం శ్రీ స్కూల్స్‌లో దీనికి తోడుగా మరో 20 వేల రూపాయల బడ్జెట్‌ను పెంచుతున్నట్లు సమాచారం. అదనపు నిధులతో విద్యార్థుల కోసం సైన్స్, సోషల్, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్ లను ప్రతీ విద్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ ల్యాబ్‌లు ఎంతో దోహద పడుతాయి.

● **గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం..**

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ 1985లో అప్పటి అస్సాం రాష్ట్రంలోని మారుమూల గ్రామం లో పర్యటించే సమయంలో చదువు లేని చిన్నా రులను గమనించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థు లకు విద్యను అందించేందుకు ఏదైనా చేయాలనే సంకల్పంతో ఢిల్లీకి తిరిగి వచ్చిన వెంటనే అప్పటి మానవవనరులశాఖ మంత్రి పీవీని పిలిచి చర్చించారు. దీంతో పీవీ నవోదయ విద్యాలయాలకు నాంది పలికారు. రాజీవ్‌గాంధీ సుముఖత వ్యక్తం చేయడంతో 1986లో పైలట్ ప్రాజెక్టుగా దేశంలో రెండు నవోదయ విద్యాలయాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం పేరు మార్పుతో అదనపు బడ్జెట్ సమకూరనుంది. దీంతో అభివృద్ధి దిశలో పయనించేందుకు నవోదయ విద్యాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యాలయంలో 80 సీట్లకు గాను 75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీలకు, 7.5 శాతం ఎస్టీలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. సీబీఎస్ఈ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కులు, మెరిట్ కేటగిరి ఆధారంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- వేములవాడ ప్రైవేట్ అద్దె గదిలో పురుగుల మందు తాగిన రేగొండ వాసి



కరుణాకర్‌రెడ్డి(ఫైల్)

వేములవాడ, సెప్టెంబరు 21: వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ అద్దె గదిలో పొన్నాల కరుణాకర్‌రెడ్డి (38) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన పొన్నాల కరుణాకర్‌రెడ్డి గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. శనివారం వేములవాడ జాత్రా గ్రౌండ్‌లోని ఓ ప్రైవేటు అద్దె గదిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అతడిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పౌల్ట్రీ వ్యాపారం చేసే కరుణాకర్ రెడ్డికి కరోనాకాలం నుంచి తీవ్ర నష్టాలు రావడంతో మూడు కోట్ల వరకు అప్పులైనట్టు బంధువుల ద్వారా తెలిసింది. కరుణాకర్‌రెడ్డి ఏప్రిల్‌లోనూ ఇంటి నుంచి వెళ్లిపోయి నెలరోజుల తర్వాత ఇంటికి చేరుకున్నాడు. మళ్లీ అప్పుల బాధలు తీవ్రమవడంతో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, బంధువులు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జి కృష్ణ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21: మండలంలోరి కొత్తపల్లి గ్రామంలో గత గురువారం జరిగిన హత్యకు సంబంధించిన నేరస్తుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఏసీపీ గజ్జి కృష్ణ వెల్లడించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి కలవేన లక్ష్మయ్య తన భార్య ఇద్దరు కొడుకులతో మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం తీగల్‌పహాడ్‌లో నివాసముంటున్నాడు. అతనికి ఇద్దరు తమ్ముళ్లు కలవేన రాజయ్య, మల్లయ్యలు గ్రామంలోనే తమకున్న భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి దగ్గరి బంధువైన కలవేన రాజేశం(68) రిటైర్డు రైల్వే ఉద్యోగి భూముల వీరి పక్కపక్కనే ఉన్నాయి. ఇక్కడే ఉంటూ సాగు చేసుకుంటున్నాడు. పదిహేనేళ్లుగా వీరి మధ్య భూతగాదాలున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయతీలు నిర్వహించగా, కోర్టులోనూ కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. కలవేన లక్ష్మయ్య, ఇద్దరు తమ్ముళ్లు రాజయ్య, మల్లయ్యలు ఈ క్రమంలో కలవేన రాజేశంపై కక్ష పెంచుకున్నారు. తరచూ జరిగే ఈ భూవివాదం, కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి రాజేశంను కడతేర్చేందుకు పథకం వేశారు.

ఈనెల 19న రాజేశం తన భూమిని కొలిపిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్నారు. అదును చూసి హత్య చేసేందుకు ముగ్గురు అన్నదమ్ములు సిద్ధమయ్యారు. తన భూమి వద్ద పని చేసుకొని రాజేశం ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముగ్గురన్నదమ్ములు మాటు వేసి ఉన్నారు. రాజేశంతో కొంత సమయం పాటు కేసులు విరమించుకోవాలని వాగ్వాదానికి దిగారు. మరోవైపు రాజేశం తలపై లక్ష్మయ్య కర్రతో బలంగా బాదాడు. అలాగే పలుమార్లు బాదడంతో రాజేశం అక్కడికక్కడే మృతిచెందాడు. ముగ్గురు అక్కడినుంచి పారిపోయారు. మృతుడి కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసుకోగా, సీఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నేరస్థుడు లక్ష్మయ్య గ్రామంలోనే ఉన్నాడన్న సమాచారంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపాడు. మల్లయ్య, రాజయ్యలు పరారీలో ఉన్నారని, హత్యకు ఉపయోగించిన కర్ర, మోటార్‌సైకిల్, రక్తపు దుస్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. త్వరలో పరారీలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుంటామన్నారు.

బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

- ఇప్పటికే రామగిరిలో-1, మంథనిలో-3 కేసులు

మంథని, సెప్టెంబరు 21: బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ అలియాస్ సతీష్‌ను త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని మంథని సీఐ రాజు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మంథని పోలీసుస్టేషన్‌లో శనివారం తాజాగా ఫిర్యాదు రావడంతో ఇనుములపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు బెదిరింపులు, అక్రమ వసూళ్లకు సంబంధించి మంథని పోలీసు సేషన్‌లో మూడు, రామగిరి పోలీసుసేషన్‌లో ఇనుముల సతీష్‌పై ఒక కేసు నమోదైనట్లు తెలిపారు. పలు కేసుల్లో ఇనుముల సత్యనారాయణకు సహకరించిన రావికంటి సతీష్‌ను ఇప్పటికే అరెస్టు చేసి జైలు పంపించామన్నారు. స్థానిక కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బెల్లంకొండ రవీందర్‌రెడ్డిని రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ బెదిరించగా అతను సత్యనారాయణకు లక్ష రూపాయలు ఇచ్చాడన్నారు. మరో లక్ష రూపాయలు కూడా ఇవ్వాలని లేకపోతే ఆస్తి, ప్రాణనష్టం కలిగిస్తానని సత్యనారాయణ పలుసార్లు బెదిరించినట్లు తెలిపారు. గతంలో బాధితుడు భయపడి ఫిర్యాదు చేయలేదని, ఇప్పుడు ఫిర్యాదు చేయడంతో సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంథని ప్రాంతంలో ఇంకా ఇనుముల సత్యనారాయణ బాధితులు ఉంటే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.





గణపతి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 21: మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిసిన కేసులో ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ శనివారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లాలోని కోడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ నాగభూషణం, మెట్‌పెల్లికి చెందిన గుండేటి మధుసూదన్ అనే ఇద్దరు అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధంచారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు.

సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి



మృతిచెందిన బానోతు లక్ష్మి

వీర్నపల్లి, సెప్టెంబర్ 21: ఉపాధిహామీ పథకం సమాచారాన్ని తెలిపేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు లక్ష్మి (58) తమకున్న పశువులతో మేతను మేపేందుకు అడవిలోకి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో సిమెంట్ దిమ్మె పక్కన సేదతీరేందుకు కూర్చుంది. అదే సమయంలో గేదెలు పోట్లాడుకుంటూ దిమ్మెకు తగలడంతో ఒక్కసారిగా ఆమెపై విరిగిపడింది. సిమెంట్ ఇటుకలు ఆమెకు బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సాయంత్రం అటునుంచి పశువులను తీసుకెళ్తున్న గిరిజనులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలికి భర్త రావుజి, కుమారులు సంతోష్, రమేష్ ఉన్నారు. పోలీసులు సంఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబరు 21: ధర్మపురిలో భాద్రపద మాసం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

● **సంకటహార చతుర్థి పూజలు..**

రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

● **యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం..**

యమ ధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం నిర్వహించారు.

● **కొండగట్టు అంజన్న సన్నిధిలో..**

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, రాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, సెప్టెంబరు 21: రామగుండం ఎన్‌టీపీసీలో ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎన్‌టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడల ద్వారా శారీరక, మానసిక దారుఢ్యం పెరుగుతుందని అన్నారు. పాఠశాల దశ నుంచి ఏదైనా ఒక క్రీడల్లో ప్రావీణ్యం పొందేలా సాధన చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 100 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ సీజీఎం సింగరాయ, అధికారులు, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

'మిడ్ మానేరు' పనులపై విజిలెన్స్ విచారణ

- ఎల్‌ఎండీలోని ఇరిగేషన్ సర్కిల్-1లో రికార్డులు స్వాధీనం



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 21: మిడ్ మానేరు రిజర్వాయర్ పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ సర్కిల్-1, కాళేశ్వరం సర్కిల్-1 కరీంనగర్ కార్యాలయానికి నలుగురు విజిలెన్స్ అధికారుల బృందం ఉదయం వచ్చి సాయంత్రం వరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో డిప్యూడీ సూపరింటెండెంట్ ఇంజనీర్(డీఎస్ఈ) అస్మత్ అలిని కలిసిన విజిలెన్స్ అధికారులు మిడ్ మానేరు ప్రాజెక్టు పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు. కాళేశ్వరం సర్కిల్-1 కార్యాలయంలో డీఎస్ఈ వెంకటయ్యను కలిసిన విజిలెన్స్ అధికారులు కాళేశ్వరం పరిధిలోని లింకు-3, ప్యాకేజీ-9 పరిధిలోని మల్కంపేట్ రిజర్వాయర్‌కు సంబంధించిన ఫైళ్లు అడిగి తీసుకొని పరిశీలించినట్లు సమాచారం. మిడ్‌మానేరు రిజర్వాయర్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు దానికి సంబంధించిన ఫైళ్లు తీసుకున్నట్లు సమాచారం. ఆయా ప్రాజెక్టు అంచనాలు కాలపరిమితి, పొడిగించిన కాలపరిమితి వివరాలు, టెండర్ ప్రక్రియ, బిల్లుల రికార్డులు, చెల్లింపులు, కాంట్రాక్టర్లు, అధికారుల వివరాలను విజిలెన్స్ అధికారులు కోరారు. ఆయా ప్రాజెక్టు పనుల్లో భాగంగా అప్పటినుంచి ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఇంజనీర్ల పూర్తి సమాచారం అడిగి తీసుకుంటున్నట్లు తెలిసింది. కార్యాలయంలోనే ఫైళ్లు, అగ్రిమెంట్లు ఇతర డాక్యుమెంట్లు పరిశీలించిన విజిలెన్స్ అధికారులు అనుమానం ఉన్న ఫైల్స్‌ను వెంట తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఏఈఈ శశిధర్, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు అండర్-19 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయ నెట్స్‌లో ఉదయం 8 గంటలనుంచి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. 2005 సెప్టెంబరు1 తరువాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు క్రికెట్ యూనిఫామ్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు.

పోత్గల్ శివారులో చిరుత కలకలం

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని పోత్గల్ శివారులో చిరుత కనిపించిందని జోరుగా ప్రచారం జరగడంతో ముస్తాబాద్, పోత్గల్ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు శనివారం భయాందోళనకు గురయ్యారు. పోత్గల్ దారిలోని రైస్‌మిల్ పక్కన మానేరు కెనాల్ నుంచి పోత్గల్ రామాలయం వైపు వెళ్తుండగా ఒర్రె వద్ద ఒక చిరుత, రెండు పిల్లలను చూసినట్లు ఓ రైతు చెప్పడంతో కలకలం నెలకొంది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై గణేశ్ గ్రామస్థులతో వచ్చి పులి అడుగులను పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి అడుగులు పెద్దగా ఉంటాయని అయినా రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని బీట్ ఆఫీసర్ రమేశ్ పేర్కొన్నారు.



పరిశీలిస్తున్న ఎస్సై గణేశ్, తదితరులు

అథ్లెటిక్స్‌లో చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా జట్టు



ట్రోఫీతో అథ్లెటిక్స్ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: రాష్ట్రస్థాయి అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. హైదరాబాద్‌లో ఈనెల 19,20 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.

ఈ పోటీల్లో ఎం వినయ్ మూడు వేల మీటర్ల పరుగులో బంగారు, మూడువేల మీటర్ల ట్రిపుల్ చేస్‌లో కాంస్య పతకం సాధించారు. విష్ణువర్ధన్ 10వేల మీటర్ల రేస్‌వాక్‌లో బంగారు పతకం, స్వామి జావలిన్‌త్రో, డిస్కస్‌త్రోలలో బంగారు పతకాలు, సంతోష్, 5వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, విక్రమ్‌కుమార్ షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించి రాష్ట్ర చాంపియన్లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కోచ్ తిరుపతి, వరుణ్‌లతో పాటు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులను అభినందించారు.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా పొన్నం రవిచంద్ర



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21: స్పెయిన్ దేశంలోని బార్సిలోనా పట్టణంలో జరగనున్న 31వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు, ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ అసిస్టెంట్ జెనరల్ సెక్రెటరీ డాక్టర్ పొన్నం రవిచంద్ర ఎంపికయ్యారు. ఈ ఏడాది నవంబరు 14 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న ఈ చిత్రోత్సవానికి స్పెయిన్ నుంచి లౌర్దేశ్ ఫెక్సియా, నార్వే నుంచి విలియం సవేరేసెన్, ఇండియా నుంచి పొన్నం రవిచంద్రలను జ్యూరీ సభ్యులుగా నియమిస్తూ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ కార్యదర్శి బీఎస్ఎస్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. రవిచంద్ర గతంలో నంది సినిమా అవార్డుల జ్యూరీ సభ్యునిగా, పోర్చుగల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యుడిగా పని చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- పాల్గొన్న 19 బాలికల, బాలుర జట్లు



సాఫ్ట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21: తెలంగాణ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభం అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాల నుండి 19 బాలికలు జట్లు, 19 బాలుర జట్లు వచ్చాయి. శనివారం నుండి సోమవారం వరకు మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మొట్ట మొదటి సారిగా జరుగుతున్న సాఫ్ట్ బాల్ పోటీలను తిలకించడానికి స్థానిక ప్రజలు ఆశక్తి చూపుతూ క్రీడా మైదానం వస్తున్నారు. మొదటి రోజు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వాహకులు ఎలాంటి అట్టహాసం లేకుండా, ముఖ్య అతిథులు ఎవరిని ఆహ్వానించకుండా సాదాసీదాగా ప్రారంభించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జట్ల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు భద్రత కరువు



విద్యార్థిని పరామర్శిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21: గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కరవవడంతోనే వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంజిత్ అన్నారు. పాము కాటుకు గురైన విద్యార్థితోపాటు కేజీబీవీలో భవనం పైనుంచి దూకి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇల్లంతకుంట మండలం గాలిపల్లి సంక్షేమ పాఠశాల విద్యార్థి రమావత్ రోహిత్, వీర్నపల్లి కేజీబీవీ విద్యార్థిని అశ్విత ను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు ప్రతీ పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాముకాటుకు గురైన విద్యార్థి రోహిత్, భవనం పైనుంచి దూకిన విద్యార్థిని అశ్వితకు మెరుగైన వైద్యం అందించాలని, ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ఈశ్వర్, అక్షయ్, మనోహర్ ఉన్నారు.

గురుకులాలను పట్టించుకోని ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట: గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ ఆరోపించారు. పాముకాటుకు గురైన విద్యార్థితోపాటు కేజీబీవీ భవనంపై నుంచి దూకి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు రమావత్ రోహిత్, వర్లపల్లి అశ్వితను శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుంటు పడినా సర్కారులో చలనం లేకుండాపోయిందన్నారు. వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నా చర్యలు కరవయ్యాయన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వసతులు కల్పించి పర్యవేక్షించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవరాజు, స్వామి, అనిల్, ప్రమోద్, శ్రీనివాస్‌గౌడ్, జహంగీర్, జుబేర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఇల్లంతకుంట:ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు అక్కెం నాగరాజు డిమాండ్ చేశారు. గాలిపెల్లి బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థి రమావత్ రోహిత్‌ను పాముకాటు వేయగా శనివారం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగంలో పూర్తిగా విఫలమైందన్నారు. మండల నాయకులు కూనబోయిన ప్రవీణ్, వరుకోలు అవినాష్, చొప్పరి అభిరాం, అఫ్రిద్, సాయి, సునీల్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను పరిశీలించిన బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని బీసీ వెల్ఫేర్ హస్టల్‌ను బీజేపీ నాయకులు శనివారం పరిశీలించారు. హస్టల్‌లో సరైన వసతులు లేకపోవడం వల్లనే విద్యార్థి పాము కాటుకు గురయ్యాడని ఆరోపించారు. ప్రభుత్వహస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, నాయకులు అశోక్‌యాదవ్, మామిడి హరీష్, శ్రీకాంత్, శ్రీనివాస్, అరుణ్, రాజు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు



సిరిసిల్లలో బీజేపీ అధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు ఆచార్యా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం సిరిసిల్లలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల మానేరు బ్రిడ్జి సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్‌బాపూజీ కొనియాడారు. అన్ని వర్గాల ప్రజల కోసం సేవలు అందించారన్నారు. గత ప్రభుత్వం ఉద్యాన విశ్వవిద్యాలయానికి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరును పెట్టినట్లు చెప్పారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, ఉపాధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కార్యదర్శి మండల సత్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పద్మశాలీ సంఘం మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, కార్యదర్శి గెంట్యాల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుజ్జె తార, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు బొల్లి రామ్మోహన్, డాక్టర్ బాలయ్య, మ్యాన రవి, ఆడెపు ప్రభాకర్, గడ్డం భగవాన్, మోర రవి, వెంగళ శ్రీనివాస్, ప్రతాప్, నళినికాంత్, ఆడెపు చంద్రకళ, కౌన్సిలర్లు దార్నం అరుణ, వెల్దండి దేవదాస్, రాజిరెడ్డి, పద్మశాలి కళ్యాణ్ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, పోపా ప్రధాన కార్యదర్శి పున్నంచందర్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ సంఘం అధ్యక్షుడు దేవాంతం, ప్రధాన కార్యదర్శి రమేశ్, యూత్ అధ్యక్షుడు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు రాజయ్య, బాల్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ చౌరస్తాలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గౌడ వాసు, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు మాధవి, పట్టణ ఉపాధ్యక్షులు ఊరగొండ రాజు, శ్రీహరి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు, మోర రవి, సదానందం, చొప్పండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో మార్కండేయ దేవాలయం సమీపంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలీ సంఘం నాయకులు రాపల్లి తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పద్మశాలి సంఘం నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు పెంటయ్య, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు

రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 21:వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ నెల 27 నుంచి ఆందోళన బాట పడతామని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు డి.లక్ష్మణ్ ప్రకటించారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ జిల్లా అధికారి అఫ్జల్ బేగంకు వ్యవసాయ విస్తరణ అధికారులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ వెయ్యి ఎకరాలకు గ్రామ వ్యవసాయ సహాయకుడిని నియమించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హేమాజీ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌గా నియమితులైన మండలంలోని నారాయణపూర్, ఎల్లారెడ్డిపేటకు చెందిన సబేరబేగం, రాంరెడ్డి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానించారు. తమపై నమ్మకంతో నియమించిందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, వెంకట్‌రెడ్డి, షకీల్ ఉన్నారు.



మంత్రి పొన్నంతో ఏఎంసీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు

ముస్తాబాద్ మార్కెట్ కమిటీ



చైర్ పర్సన్ రాణినర్సింలును సన్మానిస్తున్న నాయకులు

ముస్తాబాద్, సెప్టెంబరు 21: ముస్తాబాద్ మండల పోత్గల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తలారి రాణినర్సింలును నియమించారు. వైస్ చైర్మన్‌గా వెల్మల రాంరెడ్డి, డైరెక్టర్లుగా క్యారం రాజు, సత్యనారాయణగౌడ్ నియామకమయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు సంఘం సభ్యులు యారటి కరుణాకర్, గాంత రాజు, మల్లేశం, కొండయ్య సన్మానించారు.

విద్యార్థికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21: పాముకాటుకు గురైన మండలంలోని గాలిపెల్లి బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థి రమావత్ రోహిత్‌ను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. రోహిత్ ప్రసుత్తం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతుండగా శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆసుపత్రికి వెళ్లారు. ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని సూచించారు. కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏఎంసీ డైరెక్టర్ తాట్ల వీరేశం, గుగ్గిళ్ల భరత్ తదితరులు ఉన్నారు.

తెలుగు లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్, సెప్టెంబరు 21 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న తెలుగు అధ్యపకులుపై చ్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ డిమాండ్ చేశారు. శనివారం కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకం



వెల్మల స్వరూప



కొమిరిశెట్టి విజయ



లకావత్ రాములు



ఎల్లేష్ యాదవ్

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాజీ కౌన్సిలర్ వెల్మల స్వరూపరెడ్డిని, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సయ్యతోపాటు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్లుగా నక్క నర్సయ్య, పొన్నాల పర్శరాములు, ఎట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అనుముల శైలజ, కల్లెపల్లి తిరుపతిరెడ్డి, గుగ్గిళ్ల రాములు, దుబాల వెంకటేశం, గంగు కొండయ్య, మహ్మద్ ఖాజా మోయినోద్దీన్, అరెపల్లి బాలచందర్, చేపూరి శ్రీనివాస్, ఆడెపు జగన్నాథంతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, సింగిల్ విండో చైర్మన్‌లను డైరెక్టర్లుగా నియమిస్తున్నట్లు పేర్కొంది.

గంభీరావుపేట: గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం నియామకమైంది. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా కొమిరిశెట్టి విజయను నియమించారు. వైస్ చైర్మన్‌గా పాతూరి అంజిరెడ్డి, సభ్యులుగా కొత్తపల్లి బాల్‌రెడ్డి, కల్వకుంట్ల లక్ష్మణ్‌రావు, అల్లె రాజం, ఎడబోయిన ప్రభాకర్, కోట లింగం, భూక్య విఠల్, జంగంపల్లి గంగరాజ్‌గౌడ్, బొండ్ల సతీష్, గెరిగంటి రాజనర్సు, మహ్మద్ అజం, ఉప్పుల కృష్ణమూర్తి, వంగ రాజారాంరెడ్డి నియామకమయ్యారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా లకావత్ రాములు నాయక్, వైస్ చైర్మన్ గా లెంకెల లక్ష్మణ్‌లను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా నక్క శ్రీనివాస్, ఫణి నర్సింగం, నందగిరి శ్రీనివాస్, పారిపల్లి దేవయ్య, భూక్య సంతోష్, జోగుల మంజుల, పెడతనపల్లి చంద్రమౌళి, భూక్య రాజేందర్, భూక్య మదన్‌లాల్, అబ్బనవేని నరేష్, బానోత్ కల్పనలను సభ్యులుగా నియమించారు.

బోయినపల్లి: బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్‌గా నిమ్మ వినోద్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా అనుముల హరికృష్ణ, మహ్మద్ యూసుఫ్, బాలగోని వెంకటేష్, అద్దంకి రమేష్, గూడి రాజశేఖర్‌రెడ్డి, గంగిపల్లి లచ్చయ్య, నీరేటి ప్రదీప్ కుమార్, కల్లెపల్లి సతీష్, మహేష్, రోమాల అజయ్, కనకయ్య, సందీప్ నియామకమయ్యారు.

పీఆర్సీ అమలు చేయాలి

కోనరావుపేట సెప్టెంబరు 21: పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జంగిటి రాజు అన్నారు. కోనరావుపేట మండలంలోని పలు పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండమనేని మహేందర్ పరకాల రవీందర్ గొల్లపల్లి శ్రీనివాస్ సంతోష్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా...

● చందుర్తి :చందుర్తి మండలం నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ బాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యా యుడు జితేందర్ పాల్గొన్నారు.

● చందుర్తి: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ అనుజా జోషి అన్నారు. మండలంలోని మర్రిగడ్డలో శనివారం లోన్ మేళా నిర్వహించారు. సిరిసిల్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకు హబ్ మనేజర్ ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: కోనరావుపేట మండల స్థాయి అథ్లెటిక్స్ ఎస్‌జీఎఫ్ పోటీల్లో కనగర్తి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 11, 12, 13 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో కనగర్తి విద్యార్థులు గోల్డ్ మెడల్‌తోపాటు సిల్వర్ మెడల్ సాధించారు. హెచ్‌ఎం వినోద్ కుమార్ విద్యార్థులను అభినందించారు.

● వేములవాడ రూరల్: మండల పరిధిలోని హనుమాజీపేట లింగంపల్లి, మల్లారం, బొల్లారం గ్రామాలలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

● కోనరావుపేట: కోనరావుపేట మండలం శివంగలపల్లికి చెందిన పలువురు రైతుల పొలాల వద్ద ఉన్న విద్యుత్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని దానిరేకుల ప్రభాకర్, లింగంపల్లి శ్రీనివాస్, గంగాధర్ ,నరేష్, నేరెళ్ల సుధాకర్, నారాయణ, నోముల గోపాల్ రెడ్డికి చెందిన విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి =కి రైతులు ఫిర్యాదు చేశారు.

సభ్యుల సహకారంతో సంఘాలు బలోపేతం



సభలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, సెప్టెంబరు 21: సభ్యుల సహకారంతో సహకారంతో సంఘాలు మరింత బలోపేతం దిశగా పయనిస్తున్నాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో శనివారం మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాల సేవలు కొనసాగుతున్నాయన్నారు. సింగిల్‌విండో ద్వారా సభ్యులకు రూ.25 కోట్ల రుణాలు, ఆరు నెలల్లో సంఘంలోని రైతులకు రూ.13 కోట్ల స్వల్ప కాలిక, రూ.90 లక్షలు దీర్ఘకాలిక పంట రుణాలు అందించామన్నారు. వ్యవసాయ సహకార సంఘం సొంతంతో గోరంటాలలో రైస్‌మిల్, రాజేశ్వర్‌రావునగర్‌కాలనీలో మోడల్ కూరగాయల డైలీ మార్కెట్ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, వైస్ చైర్మన్ ఎర్ర రామాంజనేయులు, సీఈవో రాజిరెడ్డి, డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రాజ్యారెడ్డి, మురళి, అంజిరెడ్డి, రమణ, నర్సయ్య రాజేశ్వర్‌రావు, బీమ్లా, రాజవీర్, దేవరెడ్డి తదితరులు ఉన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21: తల్లిదండ్రులతో ప్రయాణిస్తున్న ఓ బాలుడు బస్సు దిగిపోగా తల్లిదండ్రులు గమనించిక పోవడంతో బాలుడు తప్పిపోయాడు. ఓ ఆటో డ్రైవర్ సాయంతో బాలుడిని పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. సిద్దపేట కంట్రోల్‌రూం ఇన్‌స్పెక్టర్ మల్లేశంగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భార్యాభర్తలు, వారి కొడుకుతో కలిసి సిరిసిల్ల నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్ ఎక్కారు. మార్గమధ్యలో సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద బస్సు ఆగడంతో బాలుడు ఓ మహిళతో కలిసి బస్సు దిగిపోయాడు. అది చూసుకోని తల్లిదండ్రులు బస్సులో వెళ్లిపోయారు. బస్సు దిగిన బాలుడు తమ తల్లిదండ్రులు గమనించకపోవడంతో ఏడవడం మొదలు పెట్టాడు. గమనించిన ఆటో డ్రైవర్ డయల్ 100 కాల్ చేసి చెప్పాడు. వెంటనే కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తమై ఆ మహిళ వద్ద ఉన్న టికెట్స్, ఆటో డ్రైవర్‌తో వాట్సాప్ చేయించుకున్నారు. ఈ విషయాన్ని వేములవాడ డిపో మేనేజర్‌కు తెలుపడంతో బస్సు నంబర్‌తోపాటు కండక్టర్ ఫోన్ నంబరు ఇచ్చారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ భిక్షపతి వెంటనే కండక్టర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు వెంటనే సిద్దిపేటకు రావడంతో బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ కంట్రోల్ రూమ్ సిబ్బందిని అభినందించారు. త్వరలో రివార్డ్ అందజేస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్, సెప్టెంబరు 21 : ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుల నియమాకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ సీహెచ్ నర్సింహరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ తెలుగులో 1, పీజీటీ ఆంగ్లంలో 1, పీజీటీ గణితంలో 2, పీజీటీ జంతు శాస్త్రంలో 1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, డెమో ఇంటర్వ్యూ 25న ఉంటుందని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే ఇబ్బందులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే సర్కారు హాస్టళ్లలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ విద్యార్థి విభాగ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మండలంలోని గాలిపెల్లి బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను శనివారం పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో అనేక సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్న సర్కారుకు గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు నరేష్, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ ప్రజా వేదిక

తంగళ్లపల్లి, సెప్టెంబరు 21: తంగళ్లపల్లి మండల ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించారు. 2023-24 సంవత్సరం నిర్వహించిన రూ.5 కోట్ల 90 లక్షల పనులు, లేబర్ వేతనాల చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనుల వివరాలను సామాజిక తనికి బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలో సమర్పించింది. డీఆర్డీవో శేషాద్రి సమక్షంలో ప్రజా వేదిక కొనసాగింది. రూ.26,286 దుర్వినియోగమైనట్లు గుర్తించి రికవరికి ఆదేశించారు. డీపీవో రామారావు, రాకేష్, రమేష్, మీర్జా, భగవంతరావు పాల్గొన్నారు.

గంభీరావుపేట ఎస్సైగా శివకుమార్

గంభీరావుపేట సెప్టెంబరు 21: గంభీరావుపేట ఎస్సైగా శివకుమార్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకు ముందు ఎస్సైగా పనిచేసిన రాంమోహన్ తంగళ్లపల్లికి బదిలీపై వెళ్లారు. సిరిసిల్ల జిల్లాలో వేకెన్సీ రిజర్వులో ఉన్న శివకుమార్ గంభీరావుపేటకు బదిలీపై వచ్చారు.

అధ్యాపకులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గంభీరావుపేట, సెప్టెంబరు 21 : గంభీరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం, ఇంగ్లీష్ అధ్యాపకులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా ఫోన్లలో అసభ్యకరమైన సందేశాలు పంపిస్తూ, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆ ఇద్దరు అధ్యాపకులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్, జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజు రావు, విభాగ్ లా ఫోరమ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్ టౌన్ సెక్రటరీ ఎల్లగందుల శ్రీనివాస్, రుద్రవేణి ధనుష్, శివ, మధు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీవో

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21: మండల పంచాయతీ అధికారిగా మాణిక్యరావు శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీవోగా పనిచేసిన అబ్దుల్‌వాజిద్ వీర్నపెల్లి మండలానికి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి శ్రీనివాస్ ఇల్లంతకుంటకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీవోకు మండలపరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వసతి గృహాలు, గురుకులాల్లో రక్షణ కరువు



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 21 : ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కరువైందని, జిల్లాలో ఒకే రోజు నాలుగు సంఘటనలు చోటు చేసుకున్నా స్పందించడంలేదని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణ ంలోని పాత బస్టాండ్‌లోని నేతన్న చౌర స్తాలో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇన్ని సంఘటనలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టింపులేని విధానాల ద్వారా ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లాలోని పలు గురుకులాల హాస్టల్స్ , విద్యాసంస్థలల్లో సమస్యలు అనేకంగా ఉన్నాయని, అందులో చదువుకుంటున్న విద్యార్థులు భయంతో బయటకు చెప్పుకోలేక పోతున్నారని అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం , ఇంగ్లీష్ అధ్యాపకులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థి రోహిత్ పాము కాటుకు గురయ్యాడని, వీర్నపల్లి మండల కేంద్రంలో కేజీబీవీలో విద్యార్థులను టార్చర్ పెడుతుండడంతో విద్యార్థిని భవనంపై దూకి గాయపడిందని అన్నారు. తంగళ్లపల్లి మండలం నేరేళ్ల గురుకులంలో ఐదు రోజుల క్రితం ఎలుకలు కొరకడంతో 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయన్నారు. జిల్లాలో దాదాపు అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో ఏదోఒక సమస్యతో విద్యార్థులు బాధపడుతున్నారన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బిల్లులు రావడం లేదని నిర్వాహకులు మధ్యాహ్నం భోజనం తయారు చేయకపోవడంతో విద్యార్థులు పస్తులుంటున్నారన్నారు. నెల రోజుల్లోనే ఇన్ని సంఘటనలు జరుగుతున్నా జిల్లా ఇన్‌చార్జి ప్రభుత్వం విప్ పటించుకోకపోవడం శోచనీయమన్నారు. సమస్యలు చెప్పినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కలెక్టర్ స్పందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, విభాగ్‌లా ఫోరమ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్, పట్టణ కార్యదర్శి ఎల్లగందుల శ్రీనివాస్, రుద్రవేణి ధనూష్, శివ, మధు, వినయ్ పాల్గొన్నారు.

ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21 : తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ, తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జయప్రదం చేయాలని మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో చిట్యాల ఐలమ్మ, కొండ లక్ష్మన్ బాపూజీ జయంతి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములుతో కలసి సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడారు. సబ్బండవర్గాల ఆధ్వర్యంలో 26న చిట్యాల ఐలమ్మ జయంతి, సెప్టెంబరు 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు పంతం రవి, దోశల చంద్రయ్య, మీసం లక్ష్మన్, బొడ్డు రాములు, చంద్రమౌళి, భిక్షపతి పాల్గొన్నారు.

సరిహద్దులు మార్చవద్దని వినతి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21: మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామపంచాయతీ సరిహద్దులు మార్చవద్దని గ్రామస్థులు శనివారం తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామపంచాయతీ నుంచి 2018లో వెంకట్రావుపల్లె గ్రామపంచాయతీగా ఏర్పడిందన్నారు. గతంలో గ్రామపంచాయతీకి ఉన్న సరిహద్దులను గ్రామస్థులకు తెలియకుండా ఎలా మారుస్తారని ప్రశ్నించారు. కొత్త గెజిట్ వచ్చిందని పేర్కొంటూ గ్రామపంచాయతీ నోటీసుబోర్డులో ఎలా పెడతారని ప్రశ్నించారు. గతంలో ఉన్న మాదిరిగానే ఓటర్లు, సరిహద్దులు ఉండాలన్నారు. లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.

రేషన్ డీలర్ల నియామకాల్లో అవకతవకలు

- అభ్యర్థుల ఆరోపణ - ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21: రేషన్ దుకాణాల డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని శనివారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట రేషన్ దుకాణాల డీలర్ల ఎంపిక ఇంటర్వ్యూ అభ్యర్థులు నిరసన తెలిపారు. వారి కథనం మేరకు.. ఆగస్టులో సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో కొత్త రేషన్ డీలర్ల నియమకానికి అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 58 కొత్త రేషన్ దుకాణాలకు 850 మంది దరఖాస్తు చేసుకున్నారు. పోటీ ఎక్కువగా ఉండడంతో సెప్టెంబరు 15న రాత పరీక్షలు నిర్వహించారు. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శనివారం ఆర్డీవో కార్యాల యంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. నియమకాల్లో అవకత వకలు జరిగాయంటూ ఆర్డీవో కార్యాలయంలో కొంత మంది అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. అధికార కాంగ్రెస్‌కు చెందిన నాయకులు అమ్ముకున్నారని, బంధువులకే రేషన్ దుకాణాలను ఇస్తున్నారని మండిపడ్డారు. రాత పరీక్ష ఫలితాలను బహిర్గతం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కలెక్టర్ స్పందించి ప్రస్తుత నియమకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

● సీఎం స్పందించాలి

రేషన్ డీలర్ల నియమకాల అవకతవకలపై ముఖ్యమంత్రి స్పందించాలని మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్ల మధుతో కలిసి సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు కొయ్యడ రమేష్‌గౌడ్ మాట్లాడారు. రేషన్ డీలర్ల నియమకాల ప్రక్రియ ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. రేషన్ డీలర్ల నియమకాలపై ఓ కాంగ్రెస్ నాయకుడు బహిరంగంగానే విమర్శించారన్నారు. ఏ ప్రోటోకాల్ లేని ఓ కాంగ్రెస్ నాయకుడు ప్రభుత్వ అధికార కార్యక్రమాలలో పాల్గొంటున్నారని ఆరోపించారు. ఆ నాయకుడి అనుచర వర్గానికి రేషన్ దుకాణాలను కట్టబెట్టబోతున్నారన్నారు. మాజీ సర్పంచుల ఫోరం నాయకులు రమేష్, ఎల్లయ్య, కొమురయ్య, దేవేందర్, అమర్‌రావు, ప్రేమ్‌కుమార్, చంటియాదవ్, రాజ్‌కుమార్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● రేషన్ దుకాణాల డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరిగాయని పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని అభ్యర్థులు సిరిసిల్ల ఆర్డీవోకు వినతిపత్రం అందించారు.



మాట్లాడుతున్న మాజీ సర్పంచుల ఫోరం నాయకులు